


ఈకాలం
THE HONEST TELUGU DAILY




సోమవారం 23-02-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :115 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల

# గోదావరి జలాల వివాదం రాజకీయరంగు పులుముకుంది:

- గత పదేళ్ల నిర్లక్ష్యం: గత ప్రభుత్వం 960 టీఎంసీలకు సరిపడా ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే, ఇప్పుడు నీటి వివాదాలే ఉండేవి కావని సీఎం అన్నారు.
- కాళేశ్వరం జం ఇతర ప్రాజెక్టులు: ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపైనే రూ. 1.10 లక్షల కోట్లు ఖర్చు చేసి, మిగతా ప్రాజెక్టులను విస్మరించారని విమర్శించారు. దీనివల్ల ప్రస్తుతం భూసేకరణకు, నిర్మాణాలకు నిధుల కొరత ఏర్పడిందన్నారు.
- మరమ్మతులే లక్ష్యం: మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులను ప్రభుత్వం వదిలేయదని.. నిపుణుల సూచనల మేరకు మరమ్మతులు చేసి వాటిని మళ్ళీ వినియోగంలోకి తెస్తామని స్పష్టం చేశారు.



కన్నాయిగూడెం: గోదావరి జలాల వివాదం రాజకీయరంగు పులుముకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే వివాదమే ఉండేది కాదన్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. తుపాకులగూడెం వద్ద దేవాదుల ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం పనుల పురోగతిపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, జిల్లా ఎమ్మెల్యేలు ఉన్నారు.

2లో




# నాలుగేళ్లుగా యుద్ధం..

## 4.5 లక్షలమందిపైగా సైనికులు మృతి!

రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ఎంతకూ తెగడం లేదు. అమెరికా మధ్యవర్తిత్వంలో కొంతకాలంగా చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. ఇరుపక్షాలూ పరస్పరం ప్రత్యేకమైన డిమాండ్లను వీడకపోవడంతో పురోగతి లభించడం లేదు. డాన్‌బాస్‌ను తమకే వదిలేయాలని మాస్కో ఒత్తిడి తెస్తోంది. ఈ షరతును ఎప్పటికీ అంగీకరించబోమని కీవ్ స్పష్టం చేస్తోంది. యుద్ధం మొదలై ఈ నెల 24కు నాలుగేళ్లు పూర్తవుతున్న వేళ కొన్ని కీలక అంశాలను గమనిస్తే..

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో నాజీ జర్మనీని ఓడించేందుకు నాటి సోవియట్ యూనియన్ 'గ్రేట్ పేట్రియాటిక్ వార్'లో భాగంగా 1,418 రోజులు పోరాడింది. ఇప్పుడు రష్యా దండయాత్ర ప్రారంభమై.. ఈ ఏడాది జనవరిలోనే 1,418 రోజులు దాటేసింది. మొదట్లో కీవ్‌ను స్వాధీనం చేసుకుని అనుకూల సర్కారును నియమించేందుకు మాస్కో చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. నాలుగేళ్లవుతున్నా ఇప్పటికీ ఫలితం ఎటూ తేలడం లేదు.

**అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులు.. పలువురి మృతి**

2014లో ఆక్రమించిన క్రిమియా సహా 20 శాతం ఉక్రెయిన్ భూభాగం ప్రస్తుతం రష్యా నియంత్రణలో ఉంది. ప్రత్యర్థి భూభాగంలో చొచ్చుకెళ్లే విషయంలో మాస్కోకు తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. గత రెండేళ్లలో దొనెట్స్క్ ప్రాంతంలోకి దాదాపు 50 కి.మీ మాత్రమే వెళ్లగలిగింది. పోక్రోవ్స్క్ నగరాన్ని స్వాధీనం చేసుకునేందుకు గత రెండేళ్లుగా రోజుకు సగటున 70 మీటర్ల చొప్పున ముందుకు సాగుతోంది. రష్యా పురోగతి నత్తనడకలా ఉందని నాటో చీఫ్ మార్క్ రుత్తే ఇటీవల వ్యాఖ్యానించారు.



ఈ యుద్ధంలో ఇప్పటివరకు ఇరువైపులా మృతి చెందిన, గాయపడిన, కనిపించకుండా పోయిన సైనికుల సంఖ్య సుమారు 20 లక్షలుగా ఉంటుందని అంచనా. అమెరికాకు చెందిన 'సెంటర్ ఫర్ స్ట్రాటెజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్' మాత్రం ఈ సంఖ్య 18 లక్షలుగా ఉందని పేర్కొంది. రష్యా సైనికులు 3.25 లక్షల మంది, ఉక్రెయిన్ సైనికులు 1.40 లక్షల మంది మృతి చెందినట్లు తెలిపింది.

2లో

## జగన్.. ఇప్పటికైనా తప్పులు ఒప్పుకొని క్షమాపణ కోరండి: మంత్రి మండిపల్లి




చిత్తూరు: చిత్తూరు పర్యటనలో ఏపీ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేవుడితోనే వైకాపా నీచ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. దేవుడిపై భక్తి, హిందువుల మనోభావాలపై జగన్‌కు గౌరవం లేదని ఆక్షేపించారు. " చెప్పులు వేసుకొని వేంకటేశ్వరస్వామి ఫొటోలతో నిరసన తెలిపారు. తితిదే సంప్రదాయాలు, హిందూ విశ్వాసాలపై జగన్‌కు చిన్న చూపు. పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన ఘనత వైకాపాదే. పరకామణి కేసులో నిందితుడితో జగన్ రాజీపడ్డారు. తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు, సేవా టికెట్లు అమ్ముకున్నారు. శ్రీవారి తలనీలాల అక్రమ రవాణాకు పాల్పడిన ఘనత వైకాపా నేతలది. వైకాపా హయాంలో 300కుపైగా దేవాలయాలపై దాడులు జరిగాయి. శ్రీవారిని అవమానించిన వ్యక్తిని తితిదే ఛైర్మన్‌గా నియమించారు. దర్శనాలు, వసతి, ప్రసాదాల ధర పెంచి భక్తులపై భారం మోపారు. దేవుడితో ఆటలు ఆడినందుకే వైకాపా 11 సీట్లకు పరిమితమైంది. జగన్.. ఇప్పటికైనా చేసిన తప్పులు ఒప్పుకొని దేవుడికి క్షమాపణ కోరాలి"అని మండిపల్లి డిమాండ్ చేశారు.

## మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ.. అగ్రనేత దేవ్‌జీ లొంగుబాటు!



హైదరాబాద్: మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. అగ్రనేతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, నర్సింహారెడ్డి అలియాస్ గంగన్నతోపాటు సుమారు 20 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు సమాచారం. ఆసిఫాబాద్ అడవుల్లో పోలీసుల ఎదుట వారు లొంగిపోయినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

దేవ్‌జీ ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఉన్నారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టు పార్టీకి ఆయన నాయకత్వం వహిస్తున్నారు.

## ప్రశ్నిస్తే దాడులు చేయడమా?: కేంద్రమంత్రి బండి సంజయ్



2లో

## శ్రీవారి ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు జగన్ కుట్ర: నిమ్మల




2లో

## హిందువుల మనోభావాలంటే వైకాపా వారికి లెక్కేలేదు: పల్లా శ్రీనివాసరావు



2లో

విశాఖపట్నం: వైకాపా అధ్యక్షుడు జగన్, ఆ పార్టీ నేతలకు దేవుడంటే భయం, భక్తి లేవని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. హిందువుల మనోభావాలంటే వారికి లెక్కేలేదన్నారు. విశాఖలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

## ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ సస్పెన్షన్ పొడిగింపు



2లో

అమరావతి: ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్, 1969లోని రూల్ 3 (3) ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. క్రిమినల్ కేసు పూర్తి లేదా పదవీ విరమణలో ఏది ముందైతే అప్పటి వరకు సస్పెన్షన్ కొనసాగనుంది.

## పేదల ఇళ్లు కూల్చి బడా బాబులకు భూములు కట్టబెట్టే కుట్ర:

- రియల్ ఎస్టేట్ మాఫియా: మూసీ సుందరీకరణ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి కేవలం భూముల కబ్జాలు, రియల్ ఎస్టేట్ దోపిడీ చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు.
- పేదల ఇళ్ల కూల్చివేత: బడా బాబులకు భూములు కట్టబెట్టడం కోసమే పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తున్నారని మండిపడ్డారు.



హైదరాబాద్: మూసీ సుందరణ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ దోపిడీ చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం వేసే ప్రతి అడుగు వెనుకా భూముల కబ్జాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఉందన్నారు.

## భూమనా నీకిది తగునా.. మిమ్మల్ని శ్రీవారు వదిలిపెట్టరు: శాప్ ఛైర్మన్ రవినాయుడు



విజయవాడ: తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని వేంకటేశ్వర స్వామి వదిలిపెట్టబోరని శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. భూమన తన స్వార్థ రాజకీయాల కోసం స్వామివారిని పణంగా పెడుతున్నారని మండిపడ్డారు. స్వామి వారితో పెట్టుకుంటే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. 365 రోజులూ స్వామి వారిపైనే ప్రెస్‌మీట్లు పెట్టడం భూమనకు తగునాఅని ప్రశ్నించారు. స్వామివారిని అడ్డం పెట్టుకొని రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు. గుడిని, హుండీని, ప్రసాదాలను, చివరికి స్వామివారికి సమర్పించిన తలనీలాలను కూడా దోచేశారని దుయ్యబట్టారు.

# ఎర్రవల్లిలో జరిగే గోటి తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొనండి

- భద్రాచల రామయ్య కల్యానానికి ఎర్రవల్లి గ్రామం ముందు
- భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు
- గోటి తలంబ్రాల లో పాల్గొనడం ఎన్ని జన్మల పుణ్యమో..



శ్రీరామనవమి నాడు భద్రాచల సీతారాముల కళ్యాణంలో గోటితో ఓలిచిన తలంబ్రాలె వాడుతారు. ఈ తలంబ్రాలు దీక్ష కార్యక్రమం సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం నుండి ప్రారంభం అవుతుందని ఈ కార్యక్రమంలో కలశాలతో వందలాది భక్తులు పాల్గొంటారన్నారు. 4 వ సారి 3క్వింటాల్ల గోటి తలంబ్రాలు కల్యానానికి అందించే భాగ్యం కలిగిందని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు అన్నారు. ఈ సందర్బంగా ఆదివారం నాడు హనుమాన్ దేవాలయంలో సమావేశం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇతర గ్రామాల భక్తులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. కోటి తలంబ్రాల దీక్ష శనివారం నాడు భారీ ఎత్తున ప్రారంభమౌతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రామభక్తులకు ఈ అవకాశం కలగజెస్తానన్నారు. ఈ గోటి తలంబ్రాల కార్యక్రమంలో స్త్రీ, పురుష లింగ బేధం లేకుండా అందరు పాల్గొనాలన్నారు. మనము లేకున్నా మనం ఓలిచే తలంబ్రాలు కళ్యాణంలో ఉంటే బహు పుణ్యం అన్నారు. గోటి తలంబ్రాల్లో పాల్గొనడం ఎన్నో జన్మల పుణ్యఫలం అని ఇంతటి అదృష్టాన్ని మాకు కల్గజేస్తున్న రామకోటి రామరాజుకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు నారన్నగారి కవిత, మహిపాల్ రెడ్డి, రాజిరెడ్డి, పాండరి, నర్సింహారెడ్డి, గోవర్ధనరెడ్డి, రామస్వామి, నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

# న్యాయవాదులు సేవాభావంతో పనిచేయాలి: ప్రొఫెసర్ వెంకటేశ్వరులు






నేటి ఆధునిక కాలంలో ఎదురవుతున్న సవాళ్లను, ముఖ్యంగా కృత్రిమ మేధ ఏఐ. వంటి సాంకేతిక మార్పులను తట్టుకుని నిలబడేలా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఓయూ లా కాలేజ్ డీన్, హెచ్ఓడీ ప్రొఫెసర్ ఎన్. వెంకటేశ్వరులు పిలుపునిచ్చారు. పటాన్చెరు మండలం ముత్తంగిలోని విశ్వ భారతి కాలేజ్ ఆఫ్ లా ఆధ్వర్యంలో నిర్వహించిన 2026గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటేశ్వరులు మాట్లాడుతూ, న్యాయవాదులు క్లయింట్ల పట్ల గౌరవంతో మెలగాలని, వారి సమస్యలను ఓపికగా వినాలని సూచించారు. న్యాయ వృత్తిలో రాణించాలంటే నిరంతర అధ్యయనం అవసరమని, రోజుకు18గంటలు కష్టపడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వృత్తిని కేవలం ధనార్జన కోసం కాకుండా, సామాజిక బాధ్యతగా భావించి సేవ చేయాలని ఆయన హితవు పలికారు. 2022,2025 విద్యా సంవత్సరంలో న్యాయవిద్య పూర్తిచేసిన 150మంది విద్యార్థులకు ఈ కార్యక్రమంలో పట్టాలను అందజేశారు. గౌరవ అతిథి ప్రొఫెసర్ డా. విజయలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు తమ కెరీర్ను అభివృద్ధి చేసుకుంటూనే సమాజానికి సేవచేయాలని, తద్వారా విద్యాసంస్థల గౌరవాన్ని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అనంత రాజమ్మ స్మారక అవార్డులను అందజేశారు. శృతి మండా గోల్డ్ మెడల్, శైలజ కొండాపురం సిల్వర్ మెడల్ ?లను కళాశాల కరస్పాండెంట్ రవి అనంత, ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని సమక్షంలో విజేతలకు అందజేశారు. ఈ వేడుకలలో అధ్యాపకులు గురుమూర్తి, తేజస్రీ, కీర్తి, రమ్యశ్రీ , విద్యార్థుల తల్లి దండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పట్టాలు అందుకున్న విద్యార్థులు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఫోటోలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు.

# మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలి : ఎమ్మెల్యే జారే



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం మండల అధ్యక్షులు కురిశెట్టి నాగబాబు అధ్యక్షతన మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన చైర్ పర్సన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్,తో పాటు మున్నూరు కాపు సంఘానికి చెందిన ప్రజాప్రతినిధులు దండాబత్తుల ఆదిలక్ష్మి, కట్టా సింధుజ, కొట్టే నాగసునీత, అట్టం రమ్య (పోకల), చిన్నంశెట్టి శ్రీను, తిరుమలశెట్టి వెంకన్నబాబు, ని శ్రీ సత్య సాయిబాబా కళ్యాణ మండపం నందు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరై కాపుసంఘ నాయకులతో కలిసి సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం ప్రజా సేవలో ముందుండాలని కోరారు. కాపుసంఘం ఆధ్వర్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులను సత్కరించడం అభినందనీయం అని తెలిపారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తుమ్మా రాంబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, మాజీ సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి కుటుంబంతోనే సంతోషం - అయిత సత్యనారాయణ



ఉమ్మడి కుటుంబంతోనే సంతోషం ఉంటుందని కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ అన్నారు ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ పుష్పలత దంపతుల కుమార్తెలు అల్లుళ్ళు రేణికుంట శ్వేతా కృష్ణ దంపతులు, ఉప్పలంచ జ్యోతి సంతోష్ కుమార్ దంపతులకు వడి బియ్యం పోసి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా అయిత సత్యనారాయణ మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలో కుటుంబంతో కలిసే క్షణాలను కొంతమంది వీడుతున్నారని అలా కాకుండా ఉమ్మడి కుటుంబంతో జీవించి అప్పుడప్పుడు అందరూ ఒకచోట కలుసుకొని వేడుకలు నిర్వహిస్తూ అందరితో కలిసిమెలిసి ఉంటే జీవితం సంతోషంగా ఉంటుందని, సమాజంలో వ్యక్తుల సంతోషానికి భద్రతకు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పునాది అని, ఉమ్మడి కుటుంబంలో పెద్దల మార్గదర్శకత్వం వారి అనుభవాలు యువతకు సరైన దిశను చూపుతాయని, ఒకరికి ఒకరు తోడుగా ఉండటం వల్ల కష్టసుఖాల్లో పాలుపంచుకునే వీలుంటుందని, పండుగలు శుభకార్యాలు, ఉమ్మడి కుటుంబంలో జరుపుకోవడం వల్ల మన సంస్కృతి సాంప్రదాయాలు వచ్చే తరానికి అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అయిత సత్యనారాయణ పుష్ప లత కుటుంబ సభ్యులు, వారి బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలల పసి కందును చంపిన దుండగులను అరెస్టు చేయాలి

**రజక సంఘం నాయకులు ఉపసర్పంచ్ అక్కరాజు నాగరాజు**



నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర జాతరలో రజక కుటుంబాన్ని గుడిలోకి రావద్దంటూ దాడి చేసిన ఘటనలో రెండు నెలల పసికందును చంపిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని తిమ్మాపూర్ గ్రామ ఉపసర్పంచ్ నాగరాజు డిమాండ్ చేశారు. స్వాతంత్రం వచ్చి డెబ్బై తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికి భారతదేశంలో కులవ్యక్షత కొనసాగుతోంది ఇప్పటికీ కులం దురాహంకారంతోటే రెండు నెలల పసికందును కాలితో చంపిన రెడ్డిలను అరెస్టు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డిల ప్రభుత్వమని స్పష్టం అవుతుందని అన్నారు. గుడిలోకి రానివ్వకుండా అడ్డుకొని దాడి చేసిన వారి పైన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వెళితే పోలీసు యంత్రాంగం రెడ్డిల పక్షాన నిలబడి కంప్లైంట్ తీసుకోవడానికి నిరాకరించి అత్యా నేరం మోపకుండా చనిపోయిన తర్వాత కూడా అటెంప్ట్ మర్డర్ అని ఎఫ్ ఐ ఆర్ లో నమోదు చేయడం పోలీసుల నిర్లక్ష్యం ధోరణి కనబడుతుంది అన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ ఘటనకు కారణమైన ప్రతి ఒక్కరిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# పలు ప్రైవేట్ కార్యక్రమాలలో పాల్గొన్న : ఎమ్మెల్యే జారే



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల కేంద్రంలో కాకతీయ గేట్ సమీపంలో సెకపల్లి శ్రీనివాసరావు నూతన టీ మ్యాజిక్ కేఫ్ ను ప్రారంభోత్సవం చేసి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నారంవారిగూడెం గ్రామంలో పేరం వారి పంచకట్టు వేడుక దమ్మపేట మండలం లచ్చాపురం గ్రామంలో ఇస్రం వారి నూతన వస్త్రాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : ఎమ్మెల్యే జారే




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం పట్వారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్తుపల్లి ప్రముఖ వైద్యశాలలు శ్రీనిధి హాస్పిటల్, లైఫ్ కేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం చాలా అవసరముందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇటువంటి ఉచిత హెల్త్ క్యాంపులు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ముఖ్యంగా ముందస్తు వైద్య పరీక్షల ద్వారా వ్యాధులను తొందరగా గుర్తించి చికిత్స పొందే అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న శ్రీనిధి, లైఫ్ కేర్ ఆస్పత్రుల యాజమాన్యాన్ని వైద్యులను సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వాసం రాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు కూరం అర్జున్ రావు, బొల్లికొండ నాగేశ్వరరావు, వంకా జానకీరాముడు, మోకాళ్ల గురుమూర్తి, అశ్వారావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు, దమ్మపేట ఎస్సై సాయికిషోర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, గ్రామ ప్రజలు, తదితరులు, పాల్గొన్నారు.

## పలు శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల కేంద్రంలో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. పసుమర్తి కృష్ణారావు కుమారుడి వివాహం ఇటీవలే జరగగా నేడు వారి నివాసానికి వెళ్లి నూతన వధువారులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం కొత్తపేటలో మాజీ వార్డ్ మెంబర్ సున్నం చిట్టెమ్మ మనవడి పంచల వేడుక, మనవరాలి ఓణీల అలంకరణ వేడుకలో పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వారితో కొయ్యల అచ్యుత్ రావు, వార్డ్ మెంబర్లు దారా రాము, రూపా రాంబాబు, ఉయ్యాల లక్ష్మీ నారాయణ, అబ్దుల్ జిన్నా, గాజుబోయిన యేసుబాబు, యార్లగడ్డ శ్రీను, దారా జనార్ధన్, పసుమర్తి రాంభద్రం, రెడ్డిమల్ల నాగయ్య, బొల్లికొండ ప్రభాకర్, బెక్కం వెంకటేశ్వరరావు, కౌలురి నాగయ్య, బెజవాడ నరసింహం, సోయం రామారావు, పోలయ్య, భూక్యా రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పరిష్కారానికి దృష్టి పెట్టాలి...

- బండి రమేష్



స్థానిక అసోసియేషన్లు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేయాలని టి పి సి సి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. బాలనగర్ డివిజన్ డి సంజీవయ్య కాలనీ అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ కు నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ఆదివారం రమేష్ నీ నియోజకవర్గ పార్టీ కార్యాలయం హేమ దుర్గా భవన్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనఆశీర్వాదం తీసుకున్నారు. అధ్యక్షుడిగా ఆరెపుల సాయి ప్రసాద్ ప్రధాన కార్యదర్శిగా మంత్రి వినోద రావు వర్కింగ్ ప్రెసిడెంట్ గా లక్ష్మణ్ ట్రెజరర్ గా అనిల్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య ,థామస్ తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ కప్ప మమత పోచయ్యకు ఘన సన్మానం

- వార్డ్ అభివృద్దే ధ్యేయం - కప్ప మమత పోచయ్య



సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1 వ వార్డు కౌన్సిలర్ గా తనను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు కప్ప మమత పోచయ్య హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం వారు వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, స్వయంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మమత పోచయ్య మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించి, తన ఘన విజయానికి ఎంతగానో సహకరించిన ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డికి, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రతాప్ రెడ్డికి, అలాగే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారందరికీ తాము ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని స్పష్టం చేశారు. వార్డులో ప్రజలు ఎదుర్కొనే ఎలాంటి సమస్యలైనా తన దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోనే 1వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఒక ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు.

## ఆత్మీయ సమ్మేళనం 50 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

- గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం..




ఆర్మూర్ లో విద్యాబుద్ధులు నేర్చుకున్న పూర్వ విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత ఒకే చోట కలిసి అపూర్వ కలయిక. ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ హైయర్ సెకండరీ స్కూల్ (బాలుర)లో 1975 - 76 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 50 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ మినీ ఫంక్షన్ హాల్ లో ఆదివారం గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 50 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులందరూ ఒకే చోట కలిసి పాత రోజుల్లో జరిగిన విద్యాభ్యాసం గురించి చర్చించుకున్నారు. ఆ రోజుల్లోనీ క్రమశిక్షణ, గురువుల పట్ల గౌరవభావం తదితర అంశాలు మాట్లాడుకున్నారు. ఆ రోజుల్లో హైయర్ సెకండరీ చదువుకుంటే సమాజంలో ఉన్న గౌరవాన్ని తెలిపారు. కుటుంబాల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ పూర్వ విద్యార్థుల్లో అనేకమంది ఉన్నత ఉద్యోగాలు సాధించి పదవి విరమణ చేశారు. కాబట్టి ప్రస్తుతం ఏం చేస్తున్నారన్న విషయాలను స్నేహితులతో పంచుకున్నారు. ఒకరి కష్టసుఖాలు మరొకరు తెలుసుకున్నారు. 50 ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులందరూ ఒకే చోట కలిసి సహపంక్తి భోజనం చేసి ఆనందంగా, ఉల్లాసంగా గడిపారు. ఈ సమ్మేళనంలో 30 మంది పూర్వ విద్యార్థులు కలిసి ఆ రోజుల్లో విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు శంకరయ్య, సుధాకర్, మార్కండేయ, రవీంద్ర మోహన్ లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇక శేషజీవితా న్ని సమాజసేవ కార్యక్రమాలు చేయడానికి నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుదర్శన్, రమేష్ బదామి, కర్తన్ కిషన్, మధుసూదన్, జి మోహన్, ఆనంద్ కుమార్ గుప్తా, జెస్సు వినయ్, ఎం రాజేశ్వర్, లక్ష్మణ్, ఎస్ మోహన్, డి. గంగాధర్, కే సూర్య ప్రకాష్, పి. జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాదుల లిఫ్టింగ్ పాయింట్ వద్ద సీఎం సమీక్ష

- ప్రాజెక్టు పురోగతిపై అధికారులకు దిశానిర్దేశం



దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు లిఫ్టింగ్ పాయింట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు అమలు స్థితిగతులు, నీటి ఎత్తిపోతల సామర్థ్యం, పంపింగ్ వ్యవస్థల పనితీరును అధికారులు వివరిస్తూ నివేదిక సమర్పించారు. సమీక్ష సమావేశంలో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు ద్వారా ఆయా జిల్లాలకు సాగునీరు అందే విధంగా చర్యలు వేగవంతం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు పూర్తి స్థాయిలో నీరు అందేలా చూడాలని సూచించారు. ప్రభుత్వం నీటిపారుదల రంగాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటుందని సీఎం స్పష్టం చేశారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు పనుల్లో నాణ్యత, వేగం రెండింటినీ సమన్వయం చేయాలని పేర్కొన్నారు.

## సమక్క సాగర్ వద్ద ముఖ్యమంత్రి పర్యటనకు ఘన స్వాగతం




ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామంలోని సమక్క సాగర్ ప్రాజెక్ట్ వద్దకు ఆదివారం హెలికాప్టర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేరుకున్నారు. ప్రాజెక్టు పనుల పరిశీలన కోసం ఆయన ప్రత్యేకంగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ లకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు, గండ్ర సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పి.ఓ. చిత్ర మిశ్రా తదితర అధికారులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. ప్రాజెక్టు అభివృద్ధి, సాగునీటి విస్తరణపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం. జిల్లాలో సాగునీటి వనరుల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## 1996-97 ఎస్ఎస్సి బ్యాచ్ మిత్రుల అమూల్య చేయూత



ఈ రోజుల్లో ఒక మిత్రునికి ఆపద వస్తే "మేమున్నాం" అని నిలబడి, వారి కుటుంబానికి ధైర్యం చెప్పడం మాటల్లో చెప్పలేనంత గొప్ప విషయం. ఆ స్నేహబంధం ఎంత నిజమో, ఎంత బలమో 1996 97 బ్యాచ్ మిత్రులు తమ చర్యలతో నిరూపించారు.ఆపదలో ఉన్న మిత్రుని కుటుంబానికి 50,000/- ఆర్థిక సహాయం అందిస్తూ, స్నేహం అంటే కేవలం జ్ఞాపకాలు కాదు అవసరమైన సమయంలో అండగా నిలబడటమే అని చూపించారు. ఇది కేవలం సహాయం కాదు అది ఒక భరోసా, ఒక మనసు, ఒక బంధం.మిత్రులకు ఎలాంటి కష్టం వచ్చినా ముందుకు వచ్చి తోడుగా నిలబడే మీ సేవాభావం నిజంగా అభినందనీయం. మీలాంటి స్నేహితులు ప్రతి బ్యాచ్‌లో ఉండాలి మీరే అందరికీ ఆదర్శం.మీ అందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు.
మీ స్నేహబంధం ఇలాగే చిరస్థాయిగా నిలవాలని కోరుకుంటూ.

## ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి హాజరై కాబోయే నూతన దంపతులను ఆశీర్వదించిన,మోకుదెబ్బ రమేష్ గౌడ్..



సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన ఆంధ్రజ్యోతి జర్నలిస్ట్ మోకుదెబ్బ జాతీయ ప్రచార కార్యదర్శి గుళ్ళపల్లి కవిత-ఉమేందర్ గౌడ్ ల కుమారుడుసాయి పృథ్వి గౌడ్ - మౌనిక ల ఎంగేజ్ మెంట్ కార్యక్రమం గౌడభవన్ (సత్యం గార్డెన్ )లో హనుమకొండ హంటర్ రోడ్డు లోని విశాల్ మార్టు దగ్గర ఆదివారం జరిగింది.ఈ కార్యక్రమానికి గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ హాజరై నూతనంగా కాబోయే వదూవరులను ఆశీర్వదించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు కంటెమ్ రవికిరణ్, వరంగల్ డీసీసీబీ సీనియర్ అసిస్టెంట్ జమ్ముల శ్రీనివాస్ రెడ్డి, వళ్ళాల శ్రీహరి గౌడ్,బూర్గు రాజేందర్ ప్రసాద్ గౌడ్,కామగోని శ్రీనివాస్ గౌడ్,బొంపెల్లి దిలీప్ రావు, కొయ్యేడి సందీప్ గౌడ్,బూర్గు సురేష్ గౌడ్, కంకటి సునిల్ గౌడ్, మేరుగు సాయి గౌడ్,రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
38

## తెలంగాణ స్టేట్ ఓపెన్ ఇంటర్ స్కూల్స్ కరాటే ఛాంపియన్షిప్ విజేతలుగా సాత్విక, సుశాంత్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం, నాగుపల్లి గ్రామము కు చెందిన ఖమ్మం అసిస్టెంట్ లైన్మెన్ బొర్రా ప్రసాద్ కు పన్నెండు సంవత్సరాల వయస్సు ఆరోవ తరగతి చదువుతున్న కుమార్తె బొర్రా సాత్విక, పది సంవత్సరాలు వయసు ఐదోవ తరగతి చదువుతున్న కుమారుడు బొర్రా సుశాంత్ కలరు. వీరు ఇరువురు కరాటే లో ఉత్తమ ప్రతిభ చూపుతున్నారు. వీరిద్దరూ ఖమ్మం బి.బి.ఎం హైస్కూల్లో చదువుతూ కరాటే లో చిన్ననాటి నుండి శిక్షణ పొందుతున్నారు. ఖమ్మం పట్టణ షాదిఖానా లో ఆదివారం జరిగిన కరాటే టోర్నమెంట్ లో బొర్రా సాత్విక బాలికల విభాగంలో సిల్వర్ మెడల్, సర్టిఫికెట్ లభించగా, బాలుర విభాగంలో గోల్డ్ మెడల్, సర్టిఫికెట్, షీల్డ్ లభించాయి. అతి చిన్న వయస్సులో పలు టోర్నమెంట్ లలో విజయం సాధిస్తున్న అక్కా తమ్ముడు లను పాఠశాల యాజమాన్యం కాంతారావు, కరాటే కోచింగ్ సి. హెచ్ రమేష్, నాగుపల్లి గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు కందిమళ్ళ లక్ష్మీనారాయణ, సర్వేశ్వరావు, దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గ్రామస్తులు ప్రశంసలు తెలిపి, భవిష్యత్తులో మరిన్నీ విజయాలు సాధించాలి అని ఆకాంక్షించారు.

## గురుకుల పరీక్షలో గందరగోళం... ప్రశ్నాపత్రాల తారుమారు

- ఆందోళనకు దిగిన విద్యార్థుల తల్లిదండ్రులు



నాగర్ కర్నూల్ జిల్లా లోని గురుకులంలో ఈ రోజుబ్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. ఇదే క్రమంలో లింగాలలోని గురుకుల పాఠశాలలో జరిగిన ప్రవేశ పరీక్షలో అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. ఏడవ తరగతి విద్యార్థులకు 8వ తరగతి ప్రశ్నాపత్రాలు ఇవ్వడంతో విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఆలస్యంగా గుర్తించిన అధికారులు సరైన పత్రాలు ఇచ్చినప్పటికీ గాని సమయం సరిపోక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి సరైన మార్గంలో నడిపించి వారిని ఉన్నత శిఖరాలకు చేర్చాల్సిన ఉపాధ్యాయులే నిర్లక్ష్యం వహించడం గమనార్హం. దీనిపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం గురించి విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149